క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: బండరావిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బండరావిరాల, చిన్నరావిరాల, గువ్వలేటి, బాచారం, సీఎస్‌ఆర్ ఫీడర్, బీఎన్‌ఆర్ ఫీడర్ తదితర ప్రాంతాల్లోని గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి యూటీఎఫ్–2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జంగయ్య, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మల్లయ్యగౌడ్, ఉపాధ్యక్షులు జంగయ్య, కౌసల్య, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌చారి, రాజేశ్, భాస్కర్, భాస్కర్‌రావు, రంజిత్‌గౌడ్, రత్నమాల, జంగయ్య తదితరులు ఉన్నారు.

దర్మన్నగూడ పంచాయతీ రికార్డుల తనిఖీ

యాచారం: మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామ పంచాయతీని బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి సందర్శించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులపై ఆరా తీశారు. ఖర్చు చేసే ప్రతి పైసాకు రికార్డు తప్పనిసరని అన్నారు. వచ్చే జూన్‌లో గ్రామంలో నాటే మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. గ్రామంలో వందశాతం ఇంటి పన్ను వసూల్ చేయాలని.. గ్రామంలో అపరిశుభ్రత, తాగునీటి పైపుల లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, మైసిగండి ఆలయంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. వైస్ ఎంపీపీ ఆనంద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మైసమ్మ ఆలయాన్ని ఎమ్మెల్సీ దర్శించుకున్నారు. ఎంపీపీ కమ్లీ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ మాజీ సర్పంచ్ వేనుగోపాల్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్‌నాయక్, జాహంగీర్‌అలీ, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

కడ్తాల్: పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ సూచించారు. మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పశువుల గర్భకోశ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సులోచన సాయిలుతో కలిసి ఆయన ప్రారంభించారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోఎంపీటీసీ మంజుల, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం గురువారం కొలువుదీరనున్నట్లు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో ఉదయం 11గంటలకు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకాగలరని పిలుపునిచ్చారు.

బీటీ రోడ్డు పూర్తయ్యేనా?

- నిలిచిన మాల్–మర్రిగూడ రోడ్డు నిర్మాణ పనులు
- నిధుల విడుదలలో జాప్యంతోనే అంటున్న కాంట్రాక్టర్
- దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


మాల్- మర్రిగూడ వెళ్లే రోడ్డుపై పోసిన కంకర

యాచారం: రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దు రోడ్డు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మునుగోడు అసెంబ్లీ ఎన్నికల పుణ్యమా అని రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే ఎన్నికల అనంతరం రోడ్డు పనులు మధ్యలోనే నిలిపేయడంతో రెండు జిల్లాల ప్రయాణికులు నిత్యం దుమ్ము, ధూళితో నరకం అనుభవిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్ (రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దు, నల్లగొండ జిల్లా రోడ్డు భవనాల శాఖ పరిధి) కేంద్రం నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంవైపు రూ.2 కోట్ల 80 లక్షల నిధులతో 1.5 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణం కోసం నల్లగొండ జిల్లా రోడ్డు భవనాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ రోడ్డు పని గతేడాది ఫిబ్రవరిలోనే ప్రారంభించి నిధుల్లేక వదిలేశారు. మునుగోడు ఎన్నికల నేపథ్యంలో జూలై నెలలో మళ్లీ ఆదరాబాదరగా పనులు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో రాత్రి, పగలు తేడా లేకుండా పనులు చేశారు. రోడ్డును తవ్వి, కంకర పోసి చదును చేశారు. ఇక రోడ్డు బీటీగా మారిపోతుందని ప్రయాణికులు సంతోషపడ్డారు. పోలింగ్ అయిపోయిన మరుసటి రోజు నుంచి ఈ రోడ్డు పనులు నిలిచిపోయాయి.

పట్టించుకోని అధికారులు

కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టిన నెల రోజుల వ్యవధిలోనే రూ.కోటికి పైగానే ఖర్చు చేసి 1.5 కి.మీ రోడ్డును తవ్వి చదును చేయించి, కంకర పర్చారు. రూ.కోటి వరకు నిధులు ఖర్చు చేశాడు. అయితే కాంట్రాక్టర్ నిధుల కోసం నల్లగొండ జిల్లా రోడ్డు భవనాల శాఖ అధికారులను సంప్రదించగా వారిని నుంచి సమాధానం కరువైంది. నిర్మాణం చేపట్టిన వరకైనా నిధులు ఇవ్వాలని అడిగినా స్పందన లేకుండా పోయింది. చివరకు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపేశాడు. రెండు జిల్లాల సరిహద్దు రోడ్డు కావడంతో ఏ జిల్లా అధికారికి ఫిర్యాదు చేయాలో ప్రయాణికులకు అర్థం కావడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా స్పందన లేదు.

ప్రమాదాలబారిన వాహనదారులు

యాచారం మండల పరిధి మాల్ కేంద్రం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు నల్లగొండ జిల్లా మర్రిగూడ, నాంపెల్లి, చండూర్ తదితర మండలాలకు రాకపోకలు సాగిస్తారు. యాచారం మండల పరిధిలోని మాల్, మంతన్‌గౌరెల్లి, మంతన్‌గౌడ్, భానుతండా, కేసీతండా, మంచాల మండల పరిధిలోని లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మతండా తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు నిత్యం మాల్ మార్కెట్‌కు ఈ రోడ్డు నుంచే వచ్చి, పోతుంటారు. రోడ్డు పూర్తిగా కంకరతో ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గతేడాది నవంబర్ నెలలో రోడ్డుపై పర్చిన కంకరపై జారిపడిన ఓ బైకిస్టు (కుమార్) పై నుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. ఇదే విషయమై నల్లగొండ జిల్లా దేవరకొండ రోడ్డు భవనాల శాఖ డీఈఈ భాస్కర్‌ను సంప్రదించగా నిధులు మంజూరు కాకపోవడంతోనే నిర్మాణ పనులు నిలిచినట్లు తెలిపారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



పాత మాల్ నుంచి ప్రధాన చౌరస్తాకు ఈ రోడ్డు నుంచే వెళ్తాం. రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో దుమ్ము, ధూళికి ఈ రోడ్డు నుంచి వెళ్లడమే మానేశాం. దుమ్ము నోట్లోకి పోయి తీవ్రమైన దగ్గు వస్తుంది. కంకరపై వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులను పూర్తిచేయాలి.

– జహంగీర్, మాల్

కార్యాలయంలో దుమ్ము చేరుతోంది



రోడ్డు పక్కనే మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఉంది. కొద్ది నెలలుగా రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే వందలాది వాహనాలతో దుమ్ము, ధూళి మొత్తం పంచాయతీ కార్యాలయంలోకి చేరుతుంది. దుమ్ము నోట్లోకి వచ్చి చేరుతుంది. రోగాలబారిన పడుతున్నాం. కార్యాలయంలో ఉండలేకపోతున్నాం.

– కవిత, సర్పంచ్ మాల్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



మాల్ నుంచి మర్రిగూడ మండలం వైపు నిర్మాణం చేపట్టే రోడ్డు పూర్తిగా నల్లగొండ జిల్లా రోడ్డు భవనాల శాఖ పరిధిలోకి వస్తుంది. ఆ జిల్లా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదు. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నల్గొండ జిల్లా అధికారులతో మాట్లాడించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తా.

– జంగమ్మ, జెడ్పీటీసీ, యాచారం

పాదయాత్రను విజయవంతం చేద్దాం

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్

యాచారం: బీఆఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఆ పార్టీ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టే ప్రగతి నివేదన పాదయాత్రను విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు నందివనపర్తిలో బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఈనెల 22న నందివనపర్తిలోని నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లను నేతలు పరిశీలించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 75 రోజుల పాటు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, బీఎన్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా, నందివనపర్తి మాజీ సర్పంచ్ రాజునాయక్, నాయకులు పాల్గొన్నారు.

మైసిగండిలో నేడు కంటివెలుగు

కడ్తాల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని, మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీహెచ్ ఈఓ సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించండి

అసోసియేషన్ అధ్యక్షుడు దానుగౌడ్


సీఐకి డైరీని అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్

అబ్దుల్లాపూర్‌మెట్: వయోధికుల (సీనియర్ సిటిజన్స్) సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బుర్ర దానుగౌడ్ బుధవారం సీఐ స్వామికి వినతిపత్రం అందజేశారు. వయోధికులకు భరోసా కల్పించేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సీనియర్ సిటిజన్స్‌తో కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని సీఐకి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గసభ్యులు మూల సత్తయ్య, నర్సింహ, బుర్ర కుమార్, నారంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగకు జిప్సం వినియోగం తప్పనిసరి


వేరుశనగ పంటలో జిప్సం చల్లే విధానాన్ని వివరిస్తున్న ఏఈఓ రాజేశ్

మాడ్గుల: వేరుశనగ పంటకు తప్పని సరిగా జిప్సం వినియోగించాలని ఏఈఓ రాజేష్ వేరుశనగ రైతులకు సూచించారు. మండలంలోని ఆర్కపల్లిలో బుధవారం వేరు శనగ రైతు కల్లు తిరుపతిరెడ్డి పొలంలో జిప్సం వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు అవశ్యకత గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. వేరుశనగ పంట సాగులో పంట వేసిన 40–45 రోజుల వ్యవధిలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయాలన్నారు. జిప్సం వాడకం వల్ల వేరుశనగ ఊడలు బలంగా వచ్చి భూమిలోకి చొచ్చుకుని పోతాయన్నారు. అంతేకాకుండా వేరుశనగ గింజలో నూనె శాతం పెరిగి కాయ గట్టిదనంగా వస్తుందని, సూక్ష్మదాతువు లోపం నివారిస్తుంది. భూమి గుళ్ళగా మారి ఎక్కువ ఊడలు వచ్చి అధిక దిగుబడి వస్తుందని ఏఈఓ రాజేశ్ రైతులకు వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలో ఎంపీఎల్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బుధవారం అయన ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని.. పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులకు స్వచ్ఛంధ సంస్థలు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్, రెడ్యా, హీరాసింగ్, అరుణ్‌నాయక్, రాందాస్, తులసీరాం,రాము, రవి, కోఆర్డీనేటర్ వినోద్, సుధీర్, విజయ్ ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

జిల్లా ఉప వైద్యాధికారి ధరణికుమార్


యాచారం: కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

యాచారం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి ధరణికుమార్ సూచించారు. యాచారం మండలంలో గురువారం నుంచి ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలనకు బుధవారం జిల్లా కంటి వెలుగు పథకం టీం పలు గ్రామాల్లో పర్యటించింది. ఎంపీడీఓ విజయలక్ష్మి, వైద్యులు రాజ్యలక్ష్మి, ప్రియాంక, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి నేత్ర వైద్యులు గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి వెలుగు శిబిరానికి హాజరయ్యేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డును వెంట తీసుకువెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలో ఈపథకం అమలు తీరుతెన్నలపై ప్రతిరోజు ఒక మండలంలో, మున్సిపాలిటీలో పరిశీలిస్తానన్నారు.

రోజుకు 300 మందికి పరీక్షలు

మాడ్గుల: మండలంలోని మాడ్గుల, ఇర్విన్ ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో కంటివెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ధరణికుమార్ పేర్కొన్నారు. మాడ్గుల, ఇర్విన్ పీహెచ్‌సీలను బుధవారం ఆయన సందర్శించారు. రోజుకు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట డాక్టర్లు మోహన్, రఘురాం నాయక్, సూపర్‌వైజర్ శేఖర్‌రెడ్డి, ల్యాబ్‌టెక్నీషియన్ మనోహర్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు ఉమర్‌ఖాన్‌గూడలో కంటివెలుగు

తుర్కయంజాల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం పురపాలక సంఘం పరిధి ఉమర్‌ఖాన్‌గూడలో ప్రారంభించనున్నట్లు కమిషనర్ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మానసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించున్నారు. 18 ఏళ్ల పైబడి ఉన్నవారు ఉచితంగా కంటి పరీక్షలను చేయించుకోవడానికి అవకాశం ఉంది.

ఆలయ అభివృద్ధికి కృషి

ఆమనగల్లు: మండల పరిధిలోని అయ్యసాగర ఆలయ అభివృద్ధికి ఫౌండేషన్ తరఫున సహాయం అందిస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. సర్పంచ్ సోనూ శ్రీను, ఎంపీటీసీ సరితాపంతు, మాజీ సర్పంచ్‌లు శ్రీరాములు, ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మహేశ్వరం: సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరమని వైస్ ఎంపీపీ సునీతానాయక్ అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని కేసీ తండాలో లబ్ధిదారుడికి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఆఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అంధ్యా నాయక్, తండావాసులు శంకర్ నాయక్, సూర్య నాయక్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని బుధవారం హయత్‌నగర్‌లోని పలు ప్రాంతల్లో పారిశుద్ధ్య కార్మికులను కలసి వారు వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికుల విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన కుటుంబాలను వెంటనే ఆదుకొని వారికి ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ సర్కిల్ అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు

జెడ్పీటీసీ వెంకటేశ్


భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న వెంకటేశ్

తలకొండపల్లి: పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను ఆయన ఎంపీపీ నిర్మలతో కలిసి బుధవారం ప్రారంభించారు. రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌నాయక్, రమేష్, రఘుపతి, లక్ష్మణ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రవి కుమార్, ఎంపీటీసీలు సోని, లక్ష్య, సునీత, సుదర్శన్‌రెడ్డి, అంబాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ విచ్చేసి మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బూత్ కమిటీలు పూర్తిచేయడం జరిగిందని, ఈ నెల 28వ తేదిలోపు పూర్తిస్థాయిలో కమిటీలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష, నేతలు.. ప్రతాప్, నర్సింహారెడ్డి, అశోక్‌గౌడ్, లచ్చిరెడ్డి, నారయణయాదవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో మినీ ఫంక్షన్ హాల్స్

డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి


మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విక్రంరెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో పేదలకోసం అన్ని హంగులతో మినీ ఫంక్షన్‌హాల్స్ నిర్మిస్తున్నామని మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. 39వ డివిజన్ పరిధిలోని కమలా నెహ్రూనగర్‌లో రూ.50లక్షలతో నిర్మిస్తున్న మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పేద, మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలకు ఇబ్బంది పడకూడదని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మినీ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వివాహాలతో పాటు ఇతర శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా అన్ని హంగులతో, 500 మంది సామర్థ్యంతో నిర్మిస్తున్నామని.. ఈ నెలాఖరు వరకు హాల్ నిర్మాణం పనులు పూర్తవుతాయని విక్రంరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, నాయకులు ఎం.దీప్‌లాల్ చౌహాన్, జిల్లెలగూడ ఆలయ మాజీ డైరెక్టర్ మాదరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయండి

- సర్వసభ్య సమావేశంలో సభ్యులు
- సమస్యలపై ఏకరువు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: మండల కేంద్రంలోని 6, 7 సర్వే నెంబర్లలో గతంలో పట్టాలిచ్చిన లబ్ధిదారులందరికీ సమానంగా భూమి వచ్చే విధంగా ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని, అదేవిధంగా ఈ సర్వే నెంబర్లలోని ఎకరా స్థలంలో గోడౌన్ నిర్మించాలని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌అన్నారు. గోడౌన్ నిర్మాణానికి రూ.కోటి మూడు లక్షల నాబార్డ్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తిర్మణీ నిర్మల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రేషన్, పింఛన్లను ప్రజలకు ఇబ్బంది లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని జెడ్పీటీసీ వెంకటేశ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. రూ.లక్ష రుణమాఫీ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎంపీపీతో పాటు పలువురు సభ్యులు కోరారు. చంద్రధనలో పాల కేంద్రాల సొసైటీలు లేక రైతులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ కుమార్ అన్నారు. శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులు నిర్మించినా ఇంకా బిల్లులు రాలేదని, గ్రామ పంచాయతీల ఖాతాలో డబ్బులు లేక ట్రాక్టర్ల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరాఫరా కావడం లేదని, అంతారం, వెంకటాపూర్ గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, లోఓల్టేజీని సరిచేయాలని సర్పంచ్ రమేష్‌యాదవ్, రఘుపతి కోరారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానని ఏఈ కటారియా హామీపత్రం రాసిచ్చారు. శిథిలమైన విద్యుత్ స్తంబాలను తొలగించాలని, మండలంలోని టీచరు పోస్టులను భర్తీ చేయాలని సభ తీర్మానించింది. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ కృష్ణ, ఎంఈఓ సర్దార్‌నాయక్, ఏఓ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.